క్లుప్తంగా

'ఆడుదాం- ఆంధ్ర'ను పకడ్బందీగా నిర్వహించాలి



ఆడుదాం- ఆంధ్ర పోస్టర్లను విడుదల చేసిన అధికారులు

ఆదోని సెంట్రల్: ఆడుదాం-ఆంధ్ర ఆటల పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమావేశ భవనంలో ఆడుదాం- ఆంధ్ర పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆటలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ రాజేష్‌కుమార్, వాలీబాల్ కోచ్ యాసూఫ్‌బాషా, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ నర్సయ్య, పురపాలక పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్‌బాబు, మండల అధ్యక్షులు సి.రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి పి.శేక్షావలి తెలిపారు. ఎస్టీయూ నూతన సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా మండల విద్యాధికారి బి.శివరాములను మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సంపాదిత సెలవులను నగదు రూపంలో మార్చుకోవడానికి అవకాశం ఇవ్వాలని, ఉపాధ్యాయుల ఎస్‌ఆర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు గోపాల్, మహాదేవప్ప, ఈరన్నగౌడ్, సుంకన్న, దానన్న రామాంజనేయులు, మండల గౌరవ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజు రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్, నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో పీడీఎస్‌యూ నాయకులు నిరసన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా కరువు కాటకాలతో ప్రజలు అల్లాడుతుంటే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయిస్తామని ఖరాకండిగా చెబుతున్నాయన్నారు. అధికారులు స్పందించి అన్ని రకాల ఫీజు రద్దు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు హరి, సునీల్, వరుణ్, హరినాథ్, క్రిష్ణ పాల్గొన్నారు.

పూలేకు నివాళి



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు వీరేంద్రగౌడ్ మాట్లాడుతూ పూలే కుల నిర్మూలన కోసం రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రామ్‌చరణ్ మూడవ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పయ్య తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి ఆ విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్ అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24, 25వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వెస్ట్ గోదావరి, కడప, చిత్తూరు జిల్లాలపై రామ్‌చరణ్ గెలుపొంది మూడవ స్థానంలో నిలిచారన్నారు.

1న సామాజిక తనిఖీ సమావేశం

కౌతాళం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ పూర్తయిందని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులపై డిసెంబర్ 1 బహిరంగ సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీఓ జుబేర్‌అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి

- మళ్లీ ఆయన్నే గెలిపించుకుందాం
- ప్రజలకు ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పిలుపు
- గోనబావిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం



గోనబావిలో సంక్షేమ పథకాలను వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోనబావి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికి మేలు జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి వైఎస్ జగన ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్నారని చెప్పారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. సత్వర సేవల కోసం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. గ్రామంలో సచివాలయం నిధులు రూ.18 లక్షలతో డ్రైయినేజీ కాలువలు వేయడం జరిగిందన్నారు. అలాగే 117 మందికి జగనన్న పట్టాలు ఇచ్చామన్నారు. కొత్త విద్యుత్ స్తంభాలు 20 మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఇలా గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో అండగా నిలబడి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రమేష్, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయతీ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, సర్పంచ్ హలీం, మండల కో–ఆప్షన్ మెంబర్ వరదరాజస్వామి, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సకతేశ్యామ్, శేషిరెడ్డి, రామకోటిరెడ్డి, కల్లపల్లి, మాజీ ఎంపీటీసీ చిన్నఈరన్న, గోవిందు, రమేష్, ఓబులేష, రాజారామ్, నీలకంఠ, వినోద్‌రెడ్డి, రాముడు, చిన్న ఈరన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 13వ వార్డు కార్వన్‌పేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జ్ రామలింగేశ్వరయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి జిలేకాబీ, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, పట్టణాధ్యక్షుడు దేవాతో కలిసి ఆయన గడప గడపకు తిరిగారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజేశ్వరరెడ్డి, నాగరాజు, బాలాజీ, చలపతి, నగరూరు గద్దం చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, చిన్నా, నాయకులు సన్ని, బ్రహ్మి, గౌస్, ఈశ్వర్, వెంకటేష్, ఫయాజ్, ఈరన్న, మమ్మత్తుస్వామి, చిన్న నాగేంద్ర, నారాయణ, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కార్వన్‌పేటలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

– సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్, ఏఈఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు ఓటు హక్కు కల్పించడమే కాకుండా ఓటరు వివరాలన్నీ పకడ్బందీగా సేకరించాలన్నారు. రిమార్క్ కాలంలో స్పష్టంగా రాయాలని సూచించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపైన పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ ఇజాజ్‌అమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ అమలు



పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఆదోనిటౌన్: ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి హామీని వైఎస్ జగనన్న నెరవేర్చారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, చైర్‌పర్సన్ బోయ శాంత, జేసీఎస్ కన్వీనర్ ఫయాజ్ అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం 2వ వార్డు బావాజీపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని చెప్పారు. 2వ వార్డులో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత ప్రభుత్వం పేదలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు జగనన్న పాలనలో కొత్త ఊర్లు వెలుస్తున్నాయన్నారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు గృహాలు నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో 10,200 మందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇల్లు మంజూరు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు అండగా నిలబడాలని కోరారు. మాయమాటలు చెప్పే టీడీపీ, జనసేన పార్టీల నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం రూ.17 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వైస్ చైర్మన్ నరసింహులు, రామదాసు, తాయన్న, వెంకటేష్, వీరంజి, తిక్కన్న, వెంకటేష్, విశ్వ, మల్లి, సుధాకర్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూలే అడుగుజాడల్లో నడుద్దాం



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోనిటౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం పాటుపడిన జ్యోతిరావుపూలే అడుగుజాడల్లో నడుద్దామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, జిలేకాబీ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవా మాట్లాడారు. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడు జ్యోతిరావుపూలే అన్నారు. మహిళలకు విద్యను అందించేందుకు తన భార్య సావిత్రిబాయిపూలేను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ఆమెతో మహిళలకు విద్యనందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కామాక్షి తిమ్మప్ప, రహీం, ఆనంద్, నాగరాజు, కల్లపల్లి, శేఖర్, చిన్నా, బాబు, మమ్మత్తుస్వామి, నాగరాజు, రాము, ఆంధ్రా లక్ష్మన్న, శీను, రంగస్వామి, తాయన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఆదోనిరూరల్: పూలే వర్ధంతిని పట్టణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల లు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బి.నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి ఎండీ బసవరాజుస్వామి మాట్లాడుతూ పూలే అంటరానితనాన్ని, కుల వ్యతిరేకతను, బాల్యవివాహాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. దేశంలో మొదటి మహిళా టీచర్‌గా సావిత్రిబా పూలే మార్గదర్శకంగా నిలిచి, వితంతువు వివాహాలను, కులమతాల వివక్షత లేకుండా ఐక్యమత్యంగా ఉండేలా కృషి చేశారన్నారు. పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, విరుపాక్షిస్వామి, శంకరయ్యస్వామి, వెంకటేష్, గురుదేవ్‌స్వామి, కిరణ్‌స్వామి, నగేష, రామన్నయాదవ్, మద్దిలేటి, షేక్షావలి, గుడికల్ కుమార్‌స్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం అభివృద్ధే లక్ష్యం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పాల్‌దినకర్

కౌతాళం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి అన్నారు. బాపురం రోడ్డు నుంచి దర్గా వరకు సిమెంటు రోడ్డుతో పాటు డ్రైనేజీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

ఏపీజీబీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



బ్యాంక్ అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతుసంఘం నాయకులు

పెద్దకడబూరు: ఖాతాదారులను చులకనగా చూస్తున్న బ్యాంక్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి అంజనేయ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదుట ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో దురుసు ప్రవర్తన కలిగిన మేనేజర్‌ను, సిబ్బందిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రైతులు, ఖాతాదారులను అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు అకారణంగా విసుక్కోవడం తగదన్నారు. అనంతరం వారు ఈ అంశంపై బ్యాంక్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో నాయకులు తిక్కన్న, జాఫర్ పటేల్, ఇస్మాయిల్, హనుమంతు, నరసింహులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



పూజలందుకుంటున్న మాచని స్వామి

కౌతాళం: మండల కేంద్రం కౌతాళం శివారులోని కామవరం రోడ్డులో వెలసిన మడమి మాచయ్య స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు కార్తీక దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు.

అంజన్నకు విశేష పూజలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కడపాళెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, వస్త్రాలంకరణ, ఫల, పుష్పాలంకరణ గావించి మహా మంగళహారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి స్వామికి మొక్కుబడిగా ఆకు పూజ కట్టించి అర్చన సహిత హారతులు ఇచ్చారు. డిసెంబర్ 12వ తేది వరకు స్వామి వారికి కార్తీక పూజోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు మెంబర్ బుల్లి నరసింహులు, కాంట్రాక్టర్ బసిరెడ్డి తదితరులు ఉన్నారు.

మద్దతు ధరతో చిరుధాన్యాల కొనుగోలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న పౌరసరఫరాల సంస్థ జిల్లా అధికారిణి శైలజ

కోసిగి: రైతులు పండించిన చిరుధాన్యాలను ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని పౌరసరఫరాల సంస్థ జిల్లా అధికారిణి శైలజ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అర్లబండ గ్రామంలో వ్యవసాయాధికారి రాజు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొర్రలు, రాగులు, జొన్నలను ప్రభుత్వమే కొంటుందన్నారు. మహేంద్ర జొన్నలు క్వింటం రూ.3,180, కొర్రలు, రాగులు, రూ.3,846 ప్రకారం తీసుకుంటామన్నారు. స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రంలోనే చిరుధాన్యాల కొనుగోలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఏపీసీఎస్‌ఎఫ్ సిబ్బంది, డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు అందించాలి



ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు

ఆదోనిరూరల్: మండలంలోని పరిసర కొండల్లో ఉన్న ఇస్వీ, ఎస్.కొండాపురం, సుల్తానాపురం, రామ్‌జల చెరువులను రిజర్వాయర్‌లుగా మార్చి నీటితో నింపి సాగునీరు అందిస్తే కరువు, వలసలు ఉండవని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఆదోని అభివృద్ధి వేదిక కన్వీనర్ హెచ్.ఆదినారాయణ అన్నారు. మంగళవారం రెవెన్యూ భవన్‌లో కరువు, వలసలు–ప్రభుత్వాల వైఖరి అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల మండలం నిత్యం కరువుతో అల్లాడుతోందన్నారు. కరువు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం అందించాలని కోరారు. సదస్సులో సీఐటీయూ జిల్లా నాయకులు ఈరన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సీఐటీయూ జిల్లా నాయకులు లక్ష్మన్న, రైతు కూలీ సంఘం నాయకులు కె.ప్రసాద్, ఐఎఫ్టీయూసీ నాయకులు, సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, సీఐటీయూ మండల అధ్యక్షులు జి.రామాంజనేయులు, రైతుసంఘం మండలాధ్యక్షులు శేఖర్‌తో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీనియర్ డాక్యుమెంట్ రైటర్ నబీ బాషా మృతి

కర్నూలు(సెంట్రల్) : సీనియర్ డాక్యుమెంట్ రైటర్ నబీబాషా (54) అనారోగ్య సమస్యలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఇతను 1992 నుంచి ఇప్పటి వరకు డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నారు. దాదాపు 32 ఏళ్లపాటు డాక్యుమెంట్లను రాసి ప్రజల మన్నలను పొందాడు. కాగా, నబీబాషా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ నాయకులు రెహమాన్, చాంద్‌బాష, అనుమంతరావు, రామకృష్ణ, చంద్రశేఖర్, శేషు, మహబూబ్‌బాష, మస్తాన్, మహ్మద్ రఫీ ఆయన మృతికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం ఉదయం షాపులను మూసి సంతాపం తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డి రైల్వే గేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున మంగళవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు రైల్వే గేటు వద్దకు వెళ్లగా ఆటో కోసం వేచి ఉన్న రాంపల్లి రామాంజినేయులు వద్ద నుంచి 750 విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని పత్తికొండ కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

కృష్ణగిరి: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులతో గొడవపడి పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. అమకతాడు గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు, లక్ష్మిదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమారుడు సోమలింగేశ్వరయ్య (23) మూగ అయినప్పటికీ కూలి, గౌండ పనిచేసేవాడు. చేతికి డబ్బులు అదడంతో మద్యానికి బానిసకావడంతో పాటు జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ నెల 26న మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా పురుగు మందు వాసన రావడంతో వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



కనకదాసు జయంతిపై చర్చిస్తున్న కురువ సంఘం ప్రతినిధులు


కర్నూలు(అర్బన్): భక్త కనకదాసు జయంతి ఉత్సవాలను ఈ నెల 30వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కురువ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే రామక్రిష్ణ, జిల్లా కోశాధికారి వెంకటరాముడు, నాయకులు పరమేష్, ఎల్లప్ప తదితరులు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మను కలిసి జయంతి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కర్నూలు బీసీ భవన్ ప్రాంగణంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటు చేసిన దృష్ట్యా అక్కడే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ బీసీ భవన్‌ను పరిశీలించి, సభ నిర్వహణపై అక్కడే ఉన్న బీసీ, కురువ సామాజిక వర్గానికి చెందిన నేతలతో మాట్లాడారు. జిల్లా కలెక్టర డా. జీ సృజన ఆదేశాల మేరకు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, మధు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌ను గెలిపించుకుందాం
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు



వైఎస్‌ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జేసీఎస్ కోసిగి మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి



బాపురంలో గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

కోసిగి/కౌతాళం: ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. కోసిగి, కౌతాళం మండలాల్లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు జరిగాయి. పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి తెలియజేశారు. కోసిగి మండలం మూగలదొడ్డి, చిర్తనకల్లు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీ మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ పాలన మధ్య తేడాను తెలియజేయాలన్నారు. జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలో వివరించాలన్నారు. అంతకు ముందు మూగలదొడ్డి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సోమేష్, చిర్తనకల్లు గ్రామ సర్పంచ్ పాటిల్ ఈరన్న ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. చిర్తనకల్లు గ్రామంలో బస్టాండ్ నుంచి సచివాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, అర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, మహాంతేష్ స్వామి, కోసిగయ్య, బుల్లి నరసింహులు, బసిరెడ్డి, గ్రామ నాయకులు రమేష్, రామిరెడ్డి, విజయభాస్కర్, మండల ఎంఎల్‌ఓ హనుమంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపురం గ్రామంలో

ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని బాపురం గ్రామ సర్పంచ్ శిల్పారెడ్డి, ఇన్‌చార్జి గురునాథ్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆ బాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి మీకు మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని ప్రజలను అడగాలన్నారు. ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరాన్ని తెలియజేయాలన్నారు. మంచి జరగాలంటే మరోసారి ఆయనకు అండగా నిలబడాలని చెప్పారు. నాడు–నేడు పథకం కింద గ్రామంలోని ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలకు కోటి రూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అలాగే చిన్న వంక బ్రిడ్జి, ఆర్‌బీకే, సీసీ రోడ్లు ఇలా చాలా పనులు గ్రామంలో చేపట్టినట్లు గురునాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, ఉప సర్పంచ్ రామాంజినేయులు, నాయకులు దివాకర్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, గిడిస్వామి, ఉమేష్‌స్వామి, దేవరెడ్డి, కుమార్‌గౌడ్, రాఘవరెడ్డి, పామిరెడ్డి, జైపాల్, అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.